# 'అన్న కేంటీన్ల'పై గౌరవ ముఖ్యమంత్రి ప్రకటన

"పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న" స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో 'అన్న కేంటిన్ల'ను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నాం. ఆనాడు కిలో బియ్యం రూ.2లకే అందించి సామాన్యుడి ఆకలి తీర్చిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం. ఇప్పుడు కిలో బియ్యం రూపాయికే అందిస్తున్నది. ప్రతి నెలా తలసరి 4 కిలోల నుంచి 5 కిలోలకు పెంచాం. కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి రేషన్ పంపిణీ చేస్తున్నాం. కోటి 47 లక్షల రేషన్ కార్డుదారులకు ప్రయోజనం కల్పిస్తున్నాం.

ఈ ఏడాది జులై 11న 50 వేలకు పైగా జనాభా వున్న పట్టణాల్లో ముందుగా 'అన్న కేంటిన్లు'కు శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత ఇవ్వడం మా ప్రభుత్వ లక్ష్యం.

అన్న కేంటీన్ల ద్వారా కేవలం రూ.5కే కడుపు నిండా భోజనం పెడుతున్నాం. ఒక రోజు (మూడు పూటలు) ఆహారం అందించేందుకు ఒక్కొక్కరికి రూ.73 ఖర్చు అవుతుంది. దీనికోసం ఏడాదికి రూ. 130 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. మొదటి దశలో 110 మున్సిపాలిటీలలో మొత్తం 204 'అన్న కేంటిన్ల'ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, వీటిలో ఇప్పటికే 100 కేంటిన్లను ప్రారంభించాం. మిగిలిన 104 'అన్న కేంటిన్ల'ను ఈ నెల 30న ఒకేసారి ప్రారంభిస్తున్నాం.

**'అన్న కేంటీన్' పథకం ప్రత్యేకతలు**

ప్రభుత్వం అందించే ఆహారం అనగానే నాణ్యతా ప్రమాణాలు పాటించరని చాలామందికి ఒక దురభిప్రాయం వుంటుంది. కానీ అన్న కేంటిన్ల ఏర్పాటు దగ్గర నుంచి నిర్వహణ వరకు ఎక్కడా రాజీ పడటం లేదు. కేఎఫ్‌సీ, మెక్ డోనాల్డ్ వంటి అంతర్జాతీయ సంస్థల స్థాయిలో కేంటిన్ల డిజైన్లు రూపొందించాం. 750 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాం.

- ఇంటర్నెట్ సౌకర్యం కలిగిన డెస్క్‌టాప్, ఆహార నాణ్యతను పర్యవేక్షించేందుకు టెంపరేచర్ గేజ్
- ఆహార పరిమాణం/డిమాండ్-సప్లయ్ తదితర లాజిస్టిక్స్‌తో కూడిన ప్రత్యేక డ్యాష్ బోర్డు ఏర్పాటు
- అన్న కేంటీన్లు అన్నింటికీ ఏకరూప ఆకృతులు, ఒకే తరహా నిర్మాణ శైలి
- అన్న కేంటీన్లు అన్నింటికీ ఒకే విధమైన ఎలివేషన్, విజిబులిటీ
- అన్ని కేంటీన్లలోనూ ఒకేతరహా నాణ్యత ప్రమాణాలతో కూడిన వంటకాలు
- సంస్థాగత, పౌరుల సౌకర్యార్థం మొబైల్ యాప్
- సీసీటీవీ నిఘా కింద కేంటీన్లు, వంట గదులకు నిరంతర పర్యవేక్షణ
- 'పచ్చదనం-పరిశుభ్రత'తో కూడిన పరిసరాలు
- సగౌరవ ఆతిథ్యం, మర్యాదపూర్వక ఆహ్వానం, సౌకర్యాలు
- ఐవీఆర్ఎస్ విధానంలో ఫీడ్‌బ్యాక్ సేకరణ
- ఆడియో విజువల్ డిస్‌ప్లే, ఎలక్ట్రానిక్ టోకెన్ పద్ధతి
- ఆహార పదార్థాలు, వంట పాత్రలు, సామాగ్రిని తరలించే వాహనాల నిరంతర పర్యవేక్షణ

'అన్న కేంటిన్ల' ద్వారా ఇప్పటిదాకా సుమారు 33,50,000 మందికి ఆహారం అందించాం. ఒక్కో అన్న కేంటిన్‌లో ఒక్కో పూట కనీసం 350 మందికి ఆహారం అందిస్తున్నాం. 350 మందికి అల్పాహారం, 550 మందికి మధ్యాహ్న భోజనం, 300 మందికి రాత్రి భోజనం సరఫరా చేస్తున్నాం.

ఇంతకు ముందు ఒకపూట భోజనం చేయాలంటే కనీసం రూ. 60 ఖర్చయ్యేది. అంతేకాకుండా, పేద కుటుంబాలకు ఇంటివద్ద వంటా వార్పు చేసే శ్రమ, సమయం ఆదా అవుతుంది. పేదవారికి ఇప్పుడు ఆ భారం తప్పింది. రోజువారీ కూలీ పనులు చేసే వాళ్లు, చిరుద్యోగులు, కార్మికులకు సమయానికి తినేందుకు అన్న కేంటిన్లలో ఆహారం అందుబాటులో వుంటోంది.

అన్న కేంటిన్లపై నిరుపేదల్లో గొప్ప ఆదరణ వ్యక్తం అవుతోంది. వీటిలో ప్రస్తుతం రోజుకు సుమారు లక్ష మంది అల్పాహారం, భోజనం చేస్తున్నారు. మొదట 50 వేల జనాభా ఉన్న పట్టణాల్లోనే అన్న కేంటిన్లను నెలకొల్పాలని భావించినా ఈ పథకానికి వచ్చిన స్పందన చూసి ప్రతి మునిసిపాలిటీలోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కేంటిన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు

రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నాం.

రాష్ట్రాన్ని మొత్తం 3 జోన్లుగా విభజించి ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. శ్రీకాకుళం నుంచి ఉభయ గోదావరి జిల్లాల వరకు ఒకజోన్, కృష్ణా జిల్లా నుంచి నెల్లూరు వరకు రెండవ జోన్, రాయల సీమ జిల్లాలను 3వ జోన్‌గా చేశాం. ఒక్కో జోన్‌లో 'సెంట్రలైజ్డ్ కిచెన్' ఏర్పాటు చేస్తున్నాం. 60 కి.మీ పరిధిలోని 'అన్న కేంటిన్ల'కు వీటి నుంచి ఆహార పంపిణీ జరుగుతుంది. ఆహార సరఫరా బాధ్యతను మరియు అన్న కేంటీన్ల నిర్వహణ బాధ్యతను టెండరు ప్రక్రియ ద్వారా 'అక్షయ పాత్ర' సంస్థకు అప్పగించాం.

| జోన్లు | జిల్లాలు | క్యాంటీన్ల సంఖ్య |
|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 74 |
| | విజయనగరం | |
| | విశాఖపట్నం | |
| | తూర్పు గోదావరి | |
| | పశ్చిమ గోదావరి | |
| 2 | కృష్ణా | |
| | గుంటూరు | |
| | ప్రకాశం | |
| | నెల్లూరు | 72 |
| 3 | చిత్తూరు | |
| | కడప | |
| | కర్నూలు | |
| | అనంతపురము | 58 |
| | మొత్తం | 204 |

ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్... ఇలా రోజుకు రెండు రకాల అల్పాహార వంటకాలు అందుబాటులో ఉంచుతున్నాం. అన్నం, కూర, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడితో రుచికరంగా భోజనం పెడుతున్నాం. స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేట్లలో ఆహారాన్ని రుచిగా, శుచిగా పెడుతున్నాం.

రాష్ట్రంలో ఏ ఒక్కరూ తిండిలేక పస్తులుండే పరిస్థితి రాకూడదు, తెలుగునేలపై ఆకలి కేకలు వినిపించకూడదనే ఈ మంచి కార్యక్రమానికి భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నాం. హైదరాబాద్‌లోని కేంటిన్లు, తమిళనాడులోని 'అమ్మ కేంటిన్లు', కర్ణాటకలో 'ఇందిరా కేంటిన్లు', కేరళలో 'జనకీయ భక్షణ శాలలు' కన్నా మన రాష్ట్రంలోని 'అన్న కేంటిన్ల'లోనే శుచిగా, రుచిగా వున్నాయని పేరు రావడం ఆనందంగా వుంది.

భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద స్థాయిలో మూడు పూటలా పేదలకు ఆహారం అందిస్తున్న వ్యవస్థ ఎక్కడా లేదు. 'అన్న కేంటిన్ల'కు అద్భుత స్పందన వస్తోంది. అతిథి మర్యాద, ఆప్యాయతతో వడ్డించడం, పేద కుటుంబాలకు "ఆత్మగౌరవం"తో భోజనం అందించడం మన 'అన్న కేంటిన్ల' ప్రత్యేకత. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమం జరుగుతున్నప్పటికీ పేదల గౌరవ మర్యాదలకు ఎటువంటి భంగం కలగని విధంగా మన రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలు జరుపుతున్నందు వల్ల ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా జరుగుతూ పేదల మన్ననలు పొందగలిగింది. ఈ కార్యక్రమాన్ని మా ప్రభుత్వం అమలు జరపడం మాకు గర్వకారణం.

'అన్న దానమే మహా దానం' అన్న ప్రాచీన నానుడికి అనుగుణంగా చాలామంది అన్న కేంటిన్ల నిర్వహణకు విరాళాలు ఇచ్చి పెద్దమనసు చాటుకుంటున్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాం. దాతలు వారి కుటుంబానికి సంబంధించిన శుభకార్యాలు లాంటి ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని అన్నదానం చేయడానికి సంకల్పించిన పక్షంలో అన్న కేంటీన్లలో వారి పేరున ఆహార పంపిణీ జరుగుతుంది. ఆయా కార్యక్రమాల్లో దాతలు కూడా పాల్గొని స్వయంగా ఆహార వితరణ చేయవచ్చు. మరింతమంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అన్న కేంటిన్ల నిర్వహణకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

అందరికీ ఆహార భద్రత కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. నాణ్యమైన ఆహారం అందించి, వైద్యంపై చేసే ఖర్చులను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే మన ప్రభుత్వ ధ్యేయం.

నారా చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రి